


# ఉదయించని ఉదయం



ఎవరి ప్రమేయంలేకుండా రేడియో మెల్లిగా పాడుతూంది.

"అమ్మా! జయమ్మా!"

మామగారి గొంతు వినిపించింది ప్రశాంతంగా, బొంగురుగా. ఆయనకు తనను రెండవసారి పిలిచే అలవాటు లేదు. ఆ కంఠంలో ఎంతో ప్రేమ మార్దవం వెలువడుతూంటుంది. తుడుస్తూన్న కొమ్మ కొంగల్ని అలానే టేబిల్‌పై ఉంచి గది బయటికి నడిచింది.

"పిలిచారా, మావయ్యా?"

"అవునమ్మా!" చదువుతూన్న దిన పత్రికనుండి ముఖం బైటపెట్టి అన్నాడు. నిర్మలంగా ఉన్న కను పాపలు అస్పష్టమైన కన్నీటి రేఖతో పరివేష్టితములై ఉన్నాయి. మసకబారిన కళ్లద్దాలనుండి ఆశగా, నిరాశగా పొడుచుకువస్తూన్న చూపులు.

"ఏం లేదమ్మా. . . వాడింకా లేవలేదా?" ఏదో తను బలంగా కోరుకొంటున్నట్లు అది చెప్పరాని కోరికైనట్లు ఇబ్బందిపడిపోయాడు. ఆయన చేష్టలు చూసి తనలో తాను నవ్వుకొంది.

"లేదు మావయ్యా. లేపమంటారా?"

"వద్దు, వద్దు. లేపకు. లేచాడేమోనని అడిగాను."

**ఆశ మనిషిని ఆశీర్వదిస్తుంటే, విధి శపిస్తుంది. సాయలా పాయలాగా జీవితం గడిచిపోవాలని ప్రతివారూ కోరుకుంటారు. కానీ అలాగ గడిచి పోయే స్తోమతు ఉండికూడా జరుకు గతుకుల్లోకి జారిపోయేవారిని దుర దృష్టవంతులంటాం. వారిపాలిట ఎదురుచూచే ఉదయం ఉదయించనే ఉదయించదు.**

గడియారంకేసి చూసికొని మళ్లీ పేపరులో తల దూర్చాడు.

"కాఫీ తీసుకున్నారా?" బాత్‌రూమ్‌కేసి నడుస్తూ ఆమె ఓ నిమిషంపాటు ఆగింది

"లేదమ్మా! ఈ వేళ ముగు రమూ ఒక్కసారే టీసికొందాం" తన కళ్లలో భావాలు ఆమె చదవకుండా బుక్ షెల్ఫ్‌కేసి చూసి అన్నాడు

"భలేవారు మావయ్యా. ఎనిమిది కావస్తూంది ఇంతవరకూ మాకోసమే ఎదురుచూస్తున్నారన్నమాట ఉదయమే చెప్పకూడదూ? ఈ పాటికి స్నానంచేసి తయారుగా ఉండేదానను."

"ఏదేనమ్మా నీవు తయారైతేమాత్రం ప్రయోజనమేమిటి? వాడు లేవకపోతే?" అంటూ చిరునవ్వుతో రేడియో ట్యూన్ చెయ్యసాగాడు.

ఇల్లంతా కలకలలాడుతూంది.

మెలికలు తిరిగిన రంగు రంగుల క్రేప్ పేపర్లు ఉదయపు చిరుగాలికి మెల్లగా కదులుతున్నాయి. వాటికి మధ్య మధ్యలో కట్టిన బెలూన్లు గాలిలో తేలుతున్నాయి. బాబా వినిపించే కోతి, గుండ్రంగా పళ్లిలు కొట్టే చింపాంజీ సైకిల్ తొక్కే ఎలుగుబంటి, వింత వింత కూతలు కూసే పక్షులు ప్లాస్టిక్ బొమ్మలూ అన్నీ కార్యక్రమానికి సిద్ధంగా ఉన్నాయి.

ఆమె పరీక్షగా కుతూహలంగా చూసింది. అవన్నీ తనకేసి చూస్తున్నట్లు తను ఎటు తిరిగితే అటు చూస్తున్నట్లనిపించింది.

అవ్యక్తమైన ఆనందంతో ఆమె హృదయం ఎత్తుగా ఎగసిపడింది. కళ్లు విప్పార్చుకొని అతనికేసి చూపు మరల్చింది

నోరూ వాయీ లేని ఆ అమాయికపు బొమ్మలన్నిటికీ నాయకునిలా వాటిని చుట్టూ పేర్చుకొని పేము కుర్చీలో కూర్చున్నాడు మామగారు. ఎవరో ఆత్మీయుడు రైల్లో వస్తూంటే ఆయనను రిసీవ్ చేసికోవటానికై పరివారంతో ప్లాట్‌ఫారంపై ఎదురు చూస్తూన్న వ్యక్తిలా క్షణాలు లెక్కపెడుతూకూర్చున్న అతనిని చూసి జాలిగా నవ్వి వెళ్లిపోయింది.

ఆమె స్నానం ముగించుకొంది.

తెల్లని గ్లాస్కో వాయిల్ చీరె కట్టుకొని తెల్లని రవిక ధరించింది. సున్నితమైన ఆ తెల్ల చీరె ఉల్లిపొరలలో ఆమె తనూ సౌందర్యం మరింత సుకుమారంగా కనిపించింది. మంచులో తడిసిన నందివర్ధన పువ్వులా తెల్లగా స్వచ్ఛంగా ఉంది.

తలంటి పోసికొన్న కురులు నీరు విడుస్తున్నాయి. వాటిని ముందుకు వేసికొని చిక్కుతీసికోసాగింది. ఎండలో నిలబడితే త్వరగా ఆరిపోతాయనిపించి ఆమె వెనక గుమ్మంనుండి బయటికి నడవబోయింది.

తన పడక గది ముందు ముసలాయన తారట్లాడడం చూసి ఆమె అలానే ఆగిపోయింది.

"ఒరేయ్ సారథీ, సార . . . బాబూ సారథీ" యుద్ధవిరమణ శ్రేణిని పాటిస్తున్న సైనికునిలా కర్టెన్‌కు ఈవలగా నిలబడి పిలుస్తున్నాడు మెల్లిగా.

అవతలనుండి సమాధానం లేదు

ఆమె అతని చేష్టలు పరిశీలిస్తూనే మరొక అడుగు వెనక్కి నడిచింది ఓ నిమిషం ఆగి మళ్లీ పిలిచాడు జేబులో కుక్కుకొన్న నోట్ల కట్టలు పలుచని ఆయన లాల్చీ జేబులోనుండి బయటికి కనుపిస్తున్నాయి.

'విచిత్రమైన మనిసి. లోనికివెళ్లి లేపకూడదూ' ఆమె అనుకొంది

ఒకొక ప్రత్యేకత తన వివాహమైన నాటినుండి తనకూ తన భర్తకూ పడక గదిగా ప్రత్యేకించాడు ఆయన గాలీ, వెలుతురూ, వెన్నెలా నిరాటంకంగా వస్తాయి. కిటికీ ఊచలకు మెలివేసికొన్న పూలతీగెలు అన్ని ఋతువుల్లోనూ చిన్న చిన్న పూలు పూస్తుంటాయి అందులో గోడపై అర్ధ వృత్తాకారపు రోజ్ ఉడ్ స్టాండ్‌పై నిలబడిన కొమ్ము కొంగల జంట ఎప్పుడూ ముక్కులు పైకెత్తుకుని ఆకాశంలోకి చూస్తుంటాయి దిగులుగా. సున్నగా నిగనిగలాడుతూ ఉన్న గంధపు చెక్కలో జీవకళ ఉట్టిపడే రెండు దుప్పులు ఒకదాని సరసన మరొకటి నిలబడి ఉంటాయి అనురాగ దాంపత్యాన్ని వెలువరించే అందమైన విలువైన చిత్రాలతో తన భర్త ఆ గదిని అలంకరించాడు. తనకు వివాహమైన నాటినుండి తన పరోక్షంలోగాని ప్రత్యక్షంలోగాని తన మామగారు ఎప్పుడూ దానిలో అడుగు పెట్టలేదు. ఎంత అత్యవసరమైన పని అయినప్పటికీ ఆయన గది బయట నిలబడి ఎటో చూస్తూ పిలిచేవాడు. ఆయన సభ్యతా సంస్కారానికి ఆమె హృదయం క్షణకాలం జోహారు లర్పించింది

"లోనికి వెళ్లి లేపకపోయారా మావయ్యా?"

"అది కాదమ్మా. . . ప్రక్కకు ఒత్తిగిలినట్లు శబ్దమయితే. . . వాడికి నిద్ర సరిపోయి ఉండదు... నిద్రపోనివ్వు."

"ఇంకెంతసేపు నిద్ర . . లేపేస్తాను. కావాలంటే మధ్యాహ్నం మళ్లీ పడుకోవచ్చు" అంటూ ఆమె పాపిడిలో దువ్వెన గుచ్చుకొని విసావిసా లోనికి నడిచి సారథిని లేపి బాత్‌రూమ్‌కు పంపించింది.

"అమ్మా పిల్లలందరూ వచ్చేస్తున్నారు. ఇల్లంతా గొడవ గొడవ చేసేస్తారు. త్వరగా బాబుకు బట్టలేసి పంపించెయ్యి. ఇంకొక విషయం. మన పనిమనుషులకు ఈ వేళ బట్టలు పెట్ట దలిచాను. ఏమంటావ్? బాబుకు ఏడుకొండలవాడి చలవ వలన ఏ జబ్బూగిబ్బూ లేకుండా నాలుగేళ్లు గడిచిపోయాయి. పేదవాళ్లు వాళ్లు కింత దానంచేస్తే మన ఇల్లు పెంపవుతుంది."

"అలానే కానివ్వండి" అంటూ "బాబుకు త్వరగా తలంటిపోసి పంపండే" అని పనిమనుషులను కేకవేసి రోడ్డుపైకి చూసింది. ఇద్దరు ముగ్గురు పిల్లలు

## తాడిగిరి పోతరాజు



'నీరూ నీడలూ'

ఫోటో—ఆర్. బి. షిండే (కొల్హాపూర్—?)

మాత్రమే నీటుగా గోటుగాముస్తాబై మెల్లిగా వస్తున్నారు. మామగారు మనమడు పుట్టిన రోజుగూర్చి చేస్తూన్న హడావుడికి ఆమె లోలోన నవ్వుకొని బట్టలు బీరువా తీసింది.

అల్మైరా మధ్యవిభాగం నిండా నాలుగయిదు సంవత్సరాల వయస్సు పిల్లవాని బట్టలు దొంతర్లు దొంతర్లుగా పేర్చి ఉన్నాయి. కొత్త బట్టలు ఒక జత బయటికి తీసి మరో చిన్న ఉన్ని కోటు తీసి కిటికీ చేరువగా వెళ్లి షర్ట్‌పై పెట్టి ఆ కోటు రంగు సరిగా మాచ్ అవుతుందో లేదోనని పరికించసాగింది.

లేత గులాబీ రంగు కోటు. కాలర్ క్రింద రెండు చిన్న పువ్వులు మృదువుగా దట్టంగా ఎంతో ముచ్చటగా ఉంది. దాన్ని పదే పదే చూస్తూ స్పృశిస్తూ పది నిముషాలు దీర్ఘాలోచనలో కొట్టుకుపోయింది. ఆ కోటుకు సంబంధించిన గత స్మృతులు ఆమె చుట్టూ పరిభ్రమించసాగాయి. దాన్నిచూస్తూ చూస్తూ, 'వేస్ట్ పేపర్'ను చుట్టినట్లు అసహ్యంగా తన గుప్పిటిలో ముడుచుకొంది.

ముఖమ్మ బుసబుసా పొంగింది. క్రింది పెదవిని పన్నుతో కరిచి పట్టుకొని కిటికీ చువ్వలు గట్టిగా పట్టుకొని దూరతీరాలలో తేలిపోతూన్న తెల్లనిమేఘాల కేసి చూసింది. దీర్ఘంగా నిశ్వాసం విడిచి మెల్లిగా కదిలింది. నగిషీలు చెక్కిన చిన్న గంధపు పెట్టె తెరిచింది.

ఉత్తరాలు. జ్ఞాపకాల రణాలను మాననివ్వకుండ రెచ్చగొట్టే పత్రాలు అక్షరాల సంజ్ఞలలో మార్చబడిన

